
తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న నేతలు

## ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

● తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 డైరీ ఆవిష్కరించి, నూతనంగా ఎనుకున్న కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డా. జి. నిర్మల మాట్లాడుతూ.. ఐఆర్ 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల విషయమై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలన్నారు. అసోసియేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ స్వామి, వైస్‌చైర్మన్ గడ్డం బాలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంకే రాజు, హెచ్‌అండ్‌టీ ఫోరం అధ్యక్షుడు తత్వానంద చారి తదితరులు పాల్గొన్నారు.

## రెండుచోట్ల డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడి

● అక్రమంగా విక్రయిస్తున్న మందుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మందులను చూపిస్తున్న అధికారులు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఔషధ నియంత్రణ అధికారులు నగరంలో రెండు చోట్ల దాడి చేసి పెద్దమొత్తంలో నిల్వచేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్‌లో అక్రమంగా గోడౌన్ నిర్వహిస్తూ మందులు విక్రయిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారంతో అధికారులు శనివారం దాడిచేశారు. యాంటీబయాటిక్స్, పీడియాట్రిక్ సిరప్‌లు, యాంటీ-అల్సర్ మందులు, మల్టీవిటమిన్లు, మల్టీమినరల్ మొదలైన ఎనిమిది రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో శామీర్‌పేట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.బాలనాగంజన్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు బి. లక్ష్మీనారాయణ, బి. ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్‌లో శ్రీ బ్లూటిస్ ఫార్మసీపై అధికారులు దాడి చేసి ఫుడ్ లైసెన్స్‌తో మల్టీ విటమిన్ క్యాప్సుల్స్ అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఆహార ఉత్పత్తి, న్యూట్రాస్యూటికల్స్ పేరుతో మలక్‌పేట్‌లో యాక్సెనిక్ హెల్త్‌కేర్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఉత్పత్తులు నకిలీవని అధికారులు వెల్లడించారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. విజయ్‌గోపాల్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, కె. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారం, ఐజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్, రన్‌లో యువత

## హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ 10కే, 21కే రన్

**రాయదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ వార్షిక ఈవెంట్-2024 హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం జరిగింది. 10కే, 21కే రన్ నిర్వహించారు. రన్‌లో రెండువేల మంది పాల్గొన్నారు. హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పి.తుకారం, ఐజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ అందజేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో ఫిట్‌నెస్ కార్యకలాపాల ప్రాధాన్యత తెలియజేయడం ఈ రన్ ఉద్దేశమన్నారు.

## అనిల్‌కుమార్‌కు సన్మానం



అనిల్‌కుమార్ యాదవ్ రాజ్యసభసభ్యుడిగా నామినేట్ అయిన సందర్భంగా ఆయనను ఆదివారం సన్మానిస్తున్న నగర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డీఎస్ మధుమతిసురేందర్, ముషీరాబాద్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సన్నిబ్రూస్‌లు - చిక్కడపల్లి

## రవిచంద్రకు ఎంపీ అవకాశంపై హర్షం



వద్దిరాజు రవిచంద్ర రెండోసారి బీఆర్ఎస్ పక్షాన రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన సందర్భంగా ఆయనను తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆరె మహేందర్ సన్మానించారు.

- చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

## కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి: సీఐ


ముషీరాబాద్ సీఐ రవిని సన్మానించిన కార్పొరేటర్ రవిచారి, బాబురావు

**ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యతతో పోలీసులకు సహకరించాలని ముషీరాబాద్ సీఐ రవి అన్నారు. ముషీరాబాద్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రవిని ఆదివారం రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాబురావు, గోపి తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... స్టేషన్ పరిధిలో దొంగతనాలు, నేరాలను అదుపు చేసేందుకు కృషిచేస్తామని, అందుకు ప్రజల సహకారం అవసరం అన్నారు.

## రాంనగర్ బాప్టిస్ట్ చర్చిలో రక్తదాన శిబిరం

**ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్‌లో రాంనగర్ బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చర్చి ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాప్టిస్ట్ చర్చి, అశ్రితా సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ బాధితుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బి.ఇమానుయల్, కోశాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ.. రెండు రోజులపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్లు పి.జాన్‌పాల్, కె.ఎస్.సిన్హా, జాన్‌శరత్‌బాబు, డేవిడ్‌రాజ్, అశ్రిత సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ఇమానుయల్, కార్యదర్శి మొలాందాస్, సబితారాణి, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పద్ధతిలోనే ఎంపీ ఎన్నికలు నిర్వహించాలి

మహాధర్నాలో పలు సంఘాల నేతలు



ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం ప్రజాసంఘాల నేతలు

**కవాడిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** భారతరాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రశాఖ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం ప్రజాసంఘాల నేతలు అన్నారు. ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పద్ధతిలో రాబోయే పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేశారు. ఈ ధర్నాకు ఫెడరేషన్ నేత నర్సింగ్‌రావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ నేత జి.శంకర్, బంద్ సొసైటీ వ్యవస్థాపకులు పల్లెల వీరస్వామి, లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాసురాంనాయక్, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర నాయకులు చింతల రాజలింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న పార్లమెంటు ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మరింత ప్రమాదంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీలు, మైనార్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.విల్సన్, పి.కన్నయ్య, పి.జగన్నాథం, మహేశ్వర్‌రాజు, పులికల్పన, లక్ష్మణ్‌తోపాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

### ఈవీఎంలను రద్దు చేయాలి : ఇంక్విలాబ్ సేన

**బర్కత్‌పుర:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను రద్దు చేసి, బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని ఇంక్విలాబ్ సేన జాతీయ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జానీ, ఎం.ఎ.హుస్సేన్ మహ్మద్ సలీం తదితరులు మాట్లాడారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇంక్విలాబ్ సేన పనిచేస్తోందన్నారు. కేంద్రంలో ఉన్నది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, రైతులేమైనా టెర్రరిస్టులా, వారిపై డ్రోన్లతో టీయర్ గ్యాస్ షెల్స్ కాల్చడం దుర్మార్గమైనచర్య అన్నారు. రైతులు ఒకవైపు వారి న్యాయమైన డిమాండ్లపై ఉద్యమిస్తోంటే ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లి రామాలయాలు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బ్రాండ్లను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు. ఢిల్లీలో రైతుల ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ దమనకాండకు నిరసనగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. రైతుల డిమాండ్లపై కేంద్రం చర్చలకు ఆహ్వానించాలన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి హామీ ఇచ్చేలా చట్టం చేయాలని, రుణమాఫీ సహా ఇతర వ్యవసాయ సంస్కరణలకు చట్టపరమైన హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజేష్, వినోద్, యాదమ్మ, నరేష్, లక్ష్మి, ఫర్హానా, ఆషియా రుక్సేనా తదితరులు పాల్గొన్నారు.

# బీసీల కులగణనతో బీసీలకు సమన్యాయం

### అసెంబ్లీలో తీర్మానం ఒక చారిత్రాత్మక నిర్ణయం : వీహెచ్


ఆలీకేఫ్ చౌరస్తాలో మహాత్మాజ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు

**రాంనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** బీసీల కులగణన చేపట్టినట్లయితే బీసీలకు సమన్యాయం జరుగుతుందని, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీల వాటా మెరుగుపడుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టి ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు వీహెచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి వీహెచ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ దశకంలో బడుగు, బలహీన వర్గాలు చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని పూలే తెలిపేవారని, ఆయన శిష్యుడిగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చదువుకుని భారత రాజ్యాంగాన్ని రాశారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలో బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన రిజర్వేషన్లు ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. 1831లో కులగణన చేపట్టారు కానీ తిరిగి ఇంతవరకు చేపట్టలేదన్నారు. దీంతో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు అన్నివర్గాల్లో న్యాయం జరగడం లేదన్నారు. బీసీ కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేపట్టి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్‌గౌడ్, గరిగంటి రమేష్, పులిజగన్, దిడ్డిరాంబాబు, నారాయణస్వామి, నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, రామ్మోహన్, యాసిన్, ప్రభాకర్, కోటం అనిల్, రాజేశ్వరరావు, హరితిలక్‌సింగ్, శ్రీధర్‌గౌడ్, మహ్మద్ ఫరీద్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌గౌడ్, సుధాకర్, కిషోర్, శశిధర్, వీరన్ననాయక్, అఫ్జల్, కోట్ల కిరణ్, మణికాంత్ సునీతరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

# సమగ్ర కులగణన చట్టాన్ని తీసుకురావాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సమగ్ర కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని ఇదే సమయంలో అన్ని రాజకీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు తెలుపడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం కాకుండా దీనికి జ్యూడిషియల్ కమిషన్ లేదా ప్రత్యేకమైన బిల్లు ప్రవేశపెడితే తెలంగాణ ప్రజానీకానికి మరింత ఉపయోగంగా ఉండేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తామన్న కుల గణనకు చట్టబద్ధత లేకపోవడం వల్ల ప్రజాధనం నిష్ప్రయోజనమయ్యే అవకాశముందన్నారు. అసెంబ్లీ తీర్మానం కంటే సమగ్ర కులగణనకు చట్టం చేయడం మరింత మెరుగైన విధానం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌటుపల్లి సురేష్, జలపల్లి కిరణ్, పండరినాథ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్.ఆర్.రహమాన్

## 5న ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై శాంతి సదస్సు

● జీహెచ్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ హెచ్‌ఆర్.రహమాన్

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై మార్చి 5న రవీంద్రభారతిలో ఇంటర్నేషనల్ జాతీయ శాంతి సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్(జీహెచ్‌ఆర్) ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ హెచ్‌ఆర్.రహమాన్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నేషనల్ జాతీయ శాంతి అవగాహన సదస్సుకు 18 రాష్ట్రాల లోని ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇప్పటికీ జమ్మూలో 180 పాఠశాలల్లో 3.5 లక్షల మంది విద్యార్థులు, అధ్యాపకులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించామన్నారు. రాజస్థాన్‌లో కూడా అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించడానికి కమిటీ వేశామన్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ తెలంగాణ అధ్యక్షులుగా నైనంపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఫాతిమా, మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ శివపావని నియమితులైనట్లు ఆయన తెలిపారు.

## పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి


మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు వెంకటేశ్వరరావు, గోవర్ధన్, ఐలయ్య, అనురాధ, శ్రీనివాస్

**రాంనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వంపై అక్రమంగా మోపిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, నాయకులు కె.గోవర్ధన్, గౌని ఐలయ్య, జి.అనురాధ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు అశోక్, గోపన్నలతోపాటు ఎస్.కె.మదార్, కె.సురేష్‌లను ఈ నెల 14న ఖమ్మం పరిసర ప్రాంతాలలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వారన్నారు. చట్టప్రకారం వారిని 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచకుండా వీరితోపాటు 120(బి) కుట్ర కేసు, ఆయుధాల చట్టంను బనాయించారని వారు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్నది ప్రజాపాలనా? నియంతృత్వ పాలనా? అని అనేక ఘటనలు ప్రశ్నిస్తున్నాయని అన్నారు. పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో కొనసాగుతున్న కూంబింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## అలరించిన సినీ సంగీత విభావరి



త్రినాథరావును సత్కరిస్తున్న అతిథులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విన్నవించుకోనా చిన్న కోరికా శీర్షికతో త్యాగరాయ గానసభలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు ఎంపిక చేసుకున్న చిత్రగీతాలను శ్రవణానందంగా ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావుకు గౌరవ డాక్టరేట్ లభించిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, ప్రముఖులు మల్లెల వసుంధర, లక్ష్మీగోపాల్, లలిత, రామకృష్ణ, సుజారమణ, రామలక్ష్మి, భారతి, శశిరేఖ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'దాడి చేసిన థియేటర్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ప్రభాస్ హీరోగా నటించిన వర్షం సినిమా ప్రదర్శన సందర్భంగా తమపై ఆర్టీసీక్రాస్‌రోడ్ దేవి థియేటర్ సిబ్బంది దాడి చేశారని ఆరోపిస్తూ రాంనగర్‌కు చెందిన యువకులు నీరజ్, ధీరజ్, సందీప్, సుజన్‌లు ఆదివారం చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి 9 గంటల ఆట సందర్భంగా టికెట్లు ఉన్నప్పటికీ కూడా థియేటర్ సిబ్బంది ఇవ్వకుండా తమను సతాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చివరకు తమపై సిబ్బంది కూల్‌డ్రింక్‌ల క్రేట్లు, కూల్‌డ్రింక్‌బాటిళ్లు, కర్రలతో దాడిచేశారని ఆరోపించారు. తమను కొట్టిన వారిపై కేసులు నమోదుచేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇల్లు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇప్పించేందుకు కృషి : కార్పొరేటర్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** హుస్సేన్‌సాగర్ నాలాకు ప్రహరీ నిర్మిస్తున్న సందర్భంలో గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ బస్తీలో ఇలు కూలిన సంఘటనలో బాధితుడికి డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఎల్‌ఐసీ బ్రిడ్జి వద్ద నాలా ప్రహరీ నిర్మాణం సందర్భంగా రాజు అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ నేపథ్యంలో బాధితుడు రాజు విజ్ఞప్తి మేరకు ఆదివారం అక్కడకు వచ్చిన కార్పొరేటర్‌పరిస్థితిని సమీక్షించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, కుమార్, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, బస్తీనాయకులు యాదగిరి, గౌస్, నర్సింగ్‌రావు, లక్ష్మణ్, చందు తదితరులుపాల్గొన్నారు.

## డబ్ల్యూబీఏఎఫ్ సీనియర్ అసోసియేట్‌గా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్


బేలబర్స్ అల్తుంటాస్‌తో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం (డబ్ల్యూబీఏఎఫ్) ఎంటర్‌ప్రెన్యూర్స్ గ్రూప్ డిప్లమసీ యాక్షన్ సీనియర్ అసోసియేట్‌గా హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సులేట్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌కు అవకాశం దక్కింది. డబ్ల్యూబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బేలబర్స్ అల్తుంటాస్ సంబంధిత పత్రాలను మీర్ నాసిర్ అలీఖాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక సంస్థలోకి సభ్యుడిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ బిజినెస్‌లో సానుకూల పరిస్థితులను గమనించడం, మార్పులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. జీ20 గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్(జీపీఎఫ్‌ఐ)కు అనుబంధ సంస్థ అయిన డబ్ల్యూబీఏఎఫ్‌లో పలు దేశాల అధ్యక్షులు, ప్రతినిధులు సభ్యులుగా కొనసాగుతున్నారు.

## లక్ష్య సాధనకు ముందుకు సాగాలి : ప్రొ.కోదండరాం


బహుమతి ప్రదానం చేస్తున్న కోదండరాం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంచుకుని లక్ష్యంవైపు విద్యార్థులు, యువత ముందుకు సాగాలని ప్రముఖ విద్యావేత్త ప్రొ.కోదండరాం అన్నారు. ఆదివారం చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో బంధన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్రంలో కళలు, సంస్కృతి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. బంధన్ అకాడమీ వ్యవస్థాపకురాలు, ప్రసిద్ధ పాత్రికేయులు డా.వనితను ఈ సందర్భంగా అభినందించారు. జేఎన్‌టీయూ పూర్వ రిజిస్ట్రార్ డా.ఎం.మంజూర్ హుస్సేన్, వరస పాల్గొన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరాం నామినేట్ అయిన సందర్భంగా ఆయనను వనిత సన్మానించారు. ఈ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పదివేల మంది చిన్నారులు పాల్గొన్నారని వివరించారు.

## క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్

**ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని దేవునితోట ప్రాంగణంలో ఓ ప్రైవేట్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ... సమాజంలో ప్రత్యేక గుర్తింపు రావాలంటే విద్యార్థులు చిన్ననాటి నుంచే బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, ప్రైవేట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అన్వర్‌ఉల్లా హుస్సేనీ, ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మద్‌భక్తియార్, ఉపాధ్యాయులు మంజుశ్రీ, అస్రా ఫాతిమా, అనీసా పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మాజీ మంత్రి

**నల్లకుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని నరేంద్రమోదీ హయాంలో పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ సూచించారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి, అంబర్‌పేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్క జగన్, జి.మల్లేష్, దత్తు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పురలోని జీవీఆర్ కరాటే అకాడమీలో జరిగిన కలర్ బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమంలో బ్రహ్మం టాలెంట్ స్కూల్ నుంచి 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్టేట్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ బెల్టులను సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంతోపాటు మనోధైర్యం, మానసిక ఉల్లాసం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు అమృతరెడ్డి, సర్వర్‌ఖాన్, షైనీ, యోగి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ సుమన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బందికి సముచిత జీతభత్యాలు చెల్లించాలి'

**రాంనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):** ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి సముచిత జీతభత్యాలు చెల్లించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం చైర్మన్ కత్తి వెంకటస్వామి అన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యూనివర్సిటీలు, కాలేజీలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా బీఈడీ, గురుకుల స్థానిక విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.